క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ కొలుపు

నింద్ర: మండల కేంద్రం నింద్రలో ఉన్న యాదవ వీధిలో గంగమ్మ కొలుపు సోమవారం ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారిని ప్రతిష్ఠించగా, ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామంలోని యాదవసంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుపై పర్యవేక్షణ


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నేతలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం సమీపంలో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నూతనంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ నాయకులు సన్నద్ధం చేస్తున్నారు. 20 అడుగుల ఎత్తులో విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఈనెల 18న ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి వ్యక్తిగత కార్యదర్శి ఆనందరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. పెద్దఎత్తున విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెవెన్యూ స్పందనకు 17 అర్జీలు

శ్రీరంగరాజపురం: స్పందన అర్జీలను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అధికారులకు ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 9 మ్యుటేషన్, 6 భూతగాదాలు, 2 శ్మశానానికి రహదారి సౌకర్యం కల్పించాలని అర్జీలు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వో, సర్వేయర్లకు సూచించారు.

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం


ఆరేటమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు రూరల్: గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని దాతలు మంగమ్మ, జగన్నాథం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం



పుత్తూరులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.రఘునాథరావు, హాస్టల్ వార్డెన్ బి.మునిరత్నం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలోని మొత్తం 40 సీట్లలో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీకి 1 కేటాయించినట్లు తెలిపారు. 4వ తరగతిలో 39 సీట్లు, 5వ తరగతిలో 36, 6వ తరగతిలో 27, 7వ తరగతిలో 23, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 20 ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఈ అన్ని సీట్లు ఎస్టీలకు మాత్రమే కేటాయించబడినవి అని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులను నేరుగా పాఠశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణపత్రం, టీసీ, ఇతర ధ్రువ పత్రాలను అందజేయాలని తెలిపారు. ఎంపిక విధానం లాటరీ పద్ధతిలో ఉంటుందని తెలిపారు.

నేడు అంబలి పంపిణీ

పుత్తూరు రూరల్: స్థానిక బజారు వీధిలో వెలసిన పిడికిలి గంగమ్మ ఆలయం వద్ద మంగళవారం ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అంబలి ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జాతరను పురస్కరించుకుని ఏటా నిర్వహించే అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు ఆలయానికి వచ్చి గంగమ్మను దర్శించుకుని ప్రసాదం స్వీకరించాలని కోరారు.

పండ్లు.. తింటే కడుపులో పుండ్లు


కృత్రిమ పద్ధతిలో మాగబెట్టిన మామిడి పండ్లు


మాగబెట్టేందుకు గోదాంలో సిద్ధంగా ఉంచిన అరటి

- మామిడి, అరటిని కృత్రిమంగా మాగబెడుతున్న వ్యాపారులు
- పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు క్యాల్షియం కార్బోనేట్ వినియోగం
- తిన్నామంటే కడుపులోకి విషం పోయినట్లే
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్న వైద్యులు

ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉండాలంటే పండ్లు తినాలి. డాక్టర్ల వద్దకు వెళ్తే తరచూ చెప్పే మాట ఇది. ప్రస్తుతం రోడ్డుపైన అమ్ముతున్న పండ్లను తిన్నామంటే మాత్రం ఆరోగ్యంగా ఉండడం దేవుడెరుగు కడుపులోకి పాయిజన్ పోవడమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మామిడి, అరటి పండ్లను త్వరగా పక్వానికి తెచ్చేందుకు కొందరు బడా వ్యాపారులు కృత్రిమంగా మాగబెడుతున్నారు. క్యాల్షియం కార్బొరేట్‌లను వినియోగించిన ఆ పండ్లను తింటే అనారోగ్యానికి గురవడం ఖాయమంటున్నారు వైద్యులు.

నగరి: మామిడి సీజన్ కావడంతో నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా పండ్ల దుకాణాలు పుట్టుకొచ్చాయి. హోల్‌సేల్ వ్యాపారులతో పాటు రోడ్డు పక్కన వందల సంఖ్యలో పండ్ల దుకాణాలు వెలిశాయి. బంగారు వర్ణంలో మెరుస్తూ తిరుపతి నుంచి చెన్నై వెళ్లే యాత్రికులను ఈ పండ్ల దుకాణాలు ఆకర్షిస్తున్నాయి. అయితే పండ్లు అంటే అందరికీ ప్రీతిపాత్రం గనుక కనిపించగానే వెంటనే తినాలని కొంటున్నారు.

కృత్రిమంగా మాగుతున్న పండు..

వ్యాపారులు దిగుమతి చేసుకున్న పండ్లను కొన్ని గోదాముల్లో గోప్యంగా మాగపెట్టేందుకు కార్బొనేట్‌లను వినియోగిస్తున్నారు. చెట్లలోని పచ్చికాయలనే కోసి కేవలం గంటల వ్యవధిలోనే రంగు మార్చేస్తున్నారు. గతంలో పండ్లను మగ్గబెట్టేందుకు సంప్రదాయ పద్ధతులు పాటించేవారు. గతంలో అరటి, మామిడి కాయలను గడ్డిలో వేసి మాగనిచ్చేవారు. దీంతో పండు రుచిగా ఉండేది. ప్రస్తుతం వ్యాపారులు విక్రయించడానికి సరిపడా పండ్లు త్వరితగతిన అవసరం కావడంతో రసాయనాలు వాడేస్తున్నారు. బడా వ్యాపారులు పెద్దఎత్తున పండ్ల తోటలను కొనుగోలు చేసి రసాయనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి కృత్రిమంగా మాగబెట్టే వారిపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..


పండ్లు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. కానీ పండ్లను మాగబెట్టేందుకు, రంగు వచ్చేందుకు కాల్షియం కార్బైడ్, రసాయనాలు వాడడం వల్ల అనేక అనారోగ్యం సమస్యలు వస్తాయి. ప్రధానంగా జీర్ణకోశ వ్యాధులు రావడంతో పాటు నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది.

– బాలకృష్ణనాయక్, మెడికల్ సూపరింటెండెంట్, నగరి ఏరియా ఆస్పత్రి

క్యాల్షియం కార్బొనేట్లు వాడకూడదు..


కాల్షియం కార్బైడ్ వాడి మామిడి కాయలను మాగబెట్టకూడదు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను దశలవారీగా కోసి మాగబెట్టుకోవాలి. అలా చేస్తే మామిడి సాగు చేసిన వారి ఆదాయం రావడంతో పాటు పండ్లు కొనుగోలు చేసి తినేవారికి ఎలాంటి హాని ఉండదు.

– డి.మధుసూదన్ రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

నేడు ద్విచక్ర వాహనాల వేలం

కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం మండలాల్లో అక్రమంగా సారా, వివిధ కేసుల్లో ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అనంతపురం వారి ఆదేశాల మేరకు సెబ్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

నగరిలో..

నగరి: నగరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వాహనాల వేలం ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి కలిగి వేలంలో పాల్గొనదలచినవారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. వివరాలకు సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య


వీర్లగుడి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్ఎం చక్రధర్‌రావు

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చక్రధర్ రావు తెలిపారు. సోమవారం వీర్లగుడి, కన్నికాపురం, మహదేవపురం గ్రామాల్లో ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, టై, బూట్లు, నాడు–నేడు కింద మౌలిక వసతులు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, ఇంగ్లిష్ మీడియం విద్య కూడా ఉందన్నారు. అందువల్ల ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల నిరసన


ఉపాధిహామీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

కార్వేటినగరం: చెమటోడ్చి కష్టపడుతున్న మాకు కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని మండలంలోని పాదిరికుప్పం గ్రామస్తులు తెలిపారు. సోమవారం వారు మండలకేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబపోషణ కోసం చేతులు కాయలు కాసేలా పనులు చేస్తున్నా గిట్టుబాటు కూలి రావడం లేదని ఆరోపించారు. పనులు చేసే చోట కనీసం వసతులు కల్పించడం లేదన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యంగా కొలతలు తీయడం వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. పక్క గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న వారికి గిట్టుబాటు కూలి వస్తోందని, కానీ తమకు మాత్రం తక్కువ కూలి వస్తోందన్నారు. తక్షణం టెక్నికల్ అసిస్టెంట్‌ను, అవగాహన లేని ఫీల్డ్ అసిస్టెంట్‌ను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులకు రాని వారికి కూడా మస్టర్లు వేస్తున్నారని, పనులు చేసే తమకు మాత్రం వారానికి రూ.200 నుంచి రూ.300 వరకు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్ మురుగేష్ మాట్లాడుతూ ఉపాధి కూలీలు చేపట్టిన పనుల్లో ఎక్కడా అవకతవకలు జరగలేదన్నారు. ఉన్నది ఉన్నట్లు కొలతలు తీశామని, కూలీలు సమయపాలన పాటించకపోవడం వల్లే గిట్టుబాటు కూలి రావడం లేదన్నారు.

తప్పు చేసిన వారిపై చర్యలు

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏపీఓ జాహ్నవి నిరసన చేస్తున్న వారికి హామీ ఇచ్చారు. నిర్లక్ష్యంగా కొలతలు తీసినట్లు, పనులకు రాకుండా ఉన్న వారికి తప్పుడు మస్టర్లు సృష్టించినట్లు విచారణలో తేలితే సంబంధిత సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో నిరసనకారులు వెనుదిరిగారు.

సచివాలయ సిబ్బంది సమస్యలపై వినతి

- రాష్ట్ర జీఎస్‌డబ్ల్యూస్ డైరెక్టర్ జి.లక్ష్మీషాకు వినతి


డైరెక్టర్ లక్ష్మీషాకు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

పుత్తూరు రూరల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సాధారణ బదిలీలతో పాటు పేస్కేల్ వర్తింపు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డెమొక్రటిక్ ఏపీ జీఎస్‌డబ్ల్యూస్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోసెఫ్ కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలు జిల్లాల నాయకులతో కలసి విజయవాడ నిర్మాణ్ భవన్‌లో రాష్ట్ర జీఎస్‌డబ్ల్యూస్ డైరెక్టర్ జి.లక్ష్మీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొబేషన్ పూర్తయిన ప్రతి సచివాలయ ఉద్యోగికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని కోరారు. బదిలీల జీవోను విడుదల చేసి వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ వర్కుకు టీఏ, డీఏలను అమలు చేయాలని కోరారు. తమ వినతిపత్రం స్వీకరించిన డైరెక్టర్ లక్ష్మీషా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చాంద్ బాషా, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విక్రమాదిత్య, కిషోర్ పాల్గొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు


వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండ మల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కమనీయం.. ద్రౌపదీ దేవి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణం కనులవిందుగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం ఆలయ ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ముస్తాబు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. కల్యాణోత్సవంలో చుటుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిరంజీవి మృతికి సంతాపం


చిరంజీవి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కుమార్‌స్వామిరెడ్డి

విజయపురం (నగరి): మండలంలోని జగన్నాథపురం ఎస్టీ కాలనీ వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరయ్య కుమారుడు చిరంజీవి (23) గుండెపోటు మరణించారు. సోమవారం మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి, స్థానిక నాయకులు చిరంజీవి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో విజయపురం ఎంపీపీ జమున చెంచు రాఘవరాజు, నారాయణరాజు, వర్మ, శివరాజు, నారపరాజు, ప్రతాప్‌రాజు పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


సబ్సిడీపై వచ్చిన ట్రాక్టర్, మడకలు, రోటవేటర్‌న్ని పరిశీలిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: రైతులు ప్రకృతి వ్యవసాయం విధానంలో జీవామృతం, కాషాయాలు వినియోగించి పంటలు సాగు చేయడంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. సోమవార పాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో రైతులకు జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ సమక్షంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చీడపీడల నివారణ, అధిక దిగుబడులు కోసం జీవామృతం వాడకం, కలుపు నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. నిస్సారంగా మారుతున్న నేలల రక్షణకు సహాయపడే పచ్చిరొట్ట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. వ్యవసాయ శాఖ 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. దీనికోసం రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని పచ్చిరొట్ట విత్తనాలను తీసుకోవచ్చని తెలిపారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీపై శ్రీబాలా.ఈ రైతుమిత్రా గ్రూపు ద్వారా అందించిన ట్రాక్టర్, మడకలు, రొటొవేటర్‌ను అందించారు. కార్యక్రమంలో సీఈఓ జయచంద్ర, సుందరాజు, మురళి రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టండి


ఎస్వీపురం టోల్ ప్లాజా వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న నేషనల్‌హైవే అధికారులు, పోలీసులు

వడమాలపేట: తిరుపతి–చెన్నై జాతీయ రహదారిలోని వడమాలపేట బైపాస్‌లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆ ప్రదేశాల్లో మరమ్మతులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పుత్తూరు సీఐ సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం వడమాలపేట బైపాస్‌రోడ్డు నుంచి పుత్తూరు వరకు నేషనల్ హైవే అధికారులతో కలిసి నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైవే రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. వాహనాదారుల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని ఇంజినీరింగ్ అధికారులకు విన్నవించారు. పాదిరేడు, కదిరిమంగళం జంక్షన్, తడుకు జంక్షన్, ఎస్వీపురం టోల్‌ప్లాజా సమీపంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించారు. స్పీడ్ బ్రేకర్ల వద్ద జీబ్రా లైన్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నేషనల్ హైవే ఇంజినీర్లు మాట్లాడుతూ హైవే పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తామని, రోడ్డు ప్రమాద ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా 20 రోజుల్లో తగు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హైవే ఇంజినీరింగ్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చే వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్ర, లీడర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాల సభ్యులకు గతంలో రూ.లక్ష వరకే రుణం ఇచ్చేవారని, ఇప్పుడు రూ.1.50 లక్షల వరకు ఇస్తున్నారని తెలిపారు. బ్యాంకుల్లో ఏడుసార్లు బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుని సక్రమంగా కంతుల ప్రకారం కట్టిన ప్రతి గ్రూపు సభ్యులకు రూ.1.50 లక్షల రుణానికి అర్హులన్నారు. తీసుకున్న రుణాలను సభ్యులు సకాలంలో చెల్లించడంతో పాటు ఆర్థికంగా ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సీసీ వినితాశ్రీ, సరస, సంఘమిత్ర మురగయ్య, మంజుల, శోభ, వీవో లీడర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు తప్పనిసరి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోక మునుపే రక్త పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాలసముద్రం, వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయాల పరిధిలో గర్భిణులకు రక్త పరీక్షలు, వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గర్భిణులు పండ్లరసం, మజ్జిగ, ఓఆర్ఎస్, నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో బయటకు వస్తే గొడుగు వినియోగించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకుంటే మాతాశిశు మరణాలు జరగవన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణులకు ప్రసవం అయ్యేవరకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

స్పందన సమస్యలను పరిష్కరించండి


టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్థానిక అధికారులు

విజయపురం (నగరి): స్పందనలో ఇచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో మండల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలపై స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నాడు–నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీలో నిర్మించే ఇళ్లకు అన్ని వసతులు ఏర్పాటు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఎంఈఓ ఆంజనేయులు, తహసీల్దార్ వెంకట్రాయులు, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


ద్విచక్ర వాహనదారుల వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ సురేష్

పాలసముద్రం: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని ఎస్ఐ సురేష్ తెలిపారు. సోమవారం చిత్తూరు–బలిజకండ్రిగ జాతీయ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు క్షేమంగా గమ్యస్థానాలు చేరుకోవాలంటే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఓవర్ స్పీడ్‌తో వెళ్లడంతో పాటు మాస్కు, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుండా రోడ్డుపై వాహనాలు నడపుతున్నారు. మద్యం తాగకుండా వాహనాలు నడపాలని సూచించారు. ముఖ్యంగా వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పక ఉండాలని, ఏ ఒక్కటి లేకపోయినా జరిమానా తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులు లేని వాహనాలకు ఆన్‌లైన్‌లో జరిమానా వేశారు.

'నీ గాలి మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు'


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

నింద్ర: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద, మంత్రి రోజా మీద నగరి టీడీపీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై నింద్ర వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా తప్పుబట్టారు. సోమవారం నింద్రలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గాలి భానుప్రకాష్ చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, ఆదుకోవడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌ను రూ.72 లక్షలు, పంచాయతీలోని 3 ఎలిమెంటరీ స్కూళ్లలో రూ.43 లక్షలతో నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. మొదటి దశలో 110 మందికి ఇంటి పట్టాలు అందజేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలియజేశారు. మండలానికి బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేయించి, గతేడాది మంత్రి రోజా ప్రారంభించారన్నారు. అలాగే నింద్రలో ప్రాచీన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణకు టీటీడీ చైర్మన్, అధికారులతో మాట్లాడి రూ.1.71 కోట్లు మంజూరు చేయించి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజనం విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, నింద్ర సర్పంచ్ వసంత బాబు రెడ్డి, వైస్ ఎంపీపీ శుభ, జిల్లా మహిళా కార్యదర్శి మేరీ, హైస్కూల్ పీఎసీ చైర్మన్ శివలింగం రెడ్డి, నాయకులు సంపత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్, నింద్ర సచివాలయ కన్వీనర్ చార్లీ పాల్గొన్నారు.